## మళ్లీ బావులకాడ పడుకోవాలా..

కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా రేవంత్ రెడ్డి ఎవుసం గురించి ఏదేదో మాట్లాడుతున్నాడు. వాళ్లకు ఏం తెలియదు. వారెన్నడన్న ఎవుసం కాడికి పోయిన ముఖాలేనా. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే మూడు గంటలు సాలని వంకరగా మాట్లాడుతున్నరు. మమ్ములను మంచిగా బతకనియ్యరా, మళ్ల కరెంటు తిప్పలు పెట్టి బాయిల కాడ పండుమంటారా, కాంగ్రెస్కోళ్ల పాలనలో ఎన్నో కష్టాలు పడ్డం. తెలంగాణ వచ్చినంక ఈ తొమ్మిదేండ్ల సంది ఏ రందీ లేకుంటా ఎవుసం చేసుకుంటున్నం. కేసీఆర్ సార్ అసంటోళ్లు ముప్పై ఏండ్ల కింద ఉంటే మా పరిస్థితి ఎంతో మారిపోవు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మూడు గంటలు కరెంటు ఎట్ల సరిపోతది. కాంగ్రెసోళ్లు మతుండి మాట్లాడుతున్నరో లేదో తెలియడం లేదు. 10 హెచ్‌పీ మోటరు పెట్టుకున్నా ఒక పొలానికి సరిపోతది. వేరే పంటలెట్ల, మా దగ్గర అంత పైకం ఉంటదా, అంత పెద్ద మోటర్‌తో నీళ్లు కట్టుకునేటట్టు ఉంటదా. మళ్లీ కేసీఆర్ సార్ సీఎం అయితేనే రైతులకు కష్టాలు ఉండవు. మేము బీఆర్ఎస్‌కు అండగా ఉంటాం.

– నందు పటేల్, మొర్గి గ్రామం, నాగల్‌గిద్ద మండలం

## లోవోల్టేజీతో మోటర్లు కాలిపోయేవి.. ఇప్పుడాతిప్పలు తప్పినయ్..

గత ఉమ్మడి రాష్ట్రంలో లోవోల్టేజీతో మోటర్లు కాలిపోయేవి...అప్పుడు టూఫేస్ కరెంట్ ఉండేది. ఆ కరెంట్‌తోనే రైతులు పంట పొలాల వద్ద ఇబ్బందులు పడేవారు. కరెంట్ పొద్దున, రాత్రి వచ్చేది. దీని వల్ల రైతులు పంటపొలాల వద్ద కరెంట్ కోసం జాగారాలు చేసేటోళ్లు. లోవోల్టేజ్ వల్ల కరెంట్ మోటర్లు కాలిపోయేవి.

మోటర్లు బాగు చేయాలంటే రెండు, మూడు రోజులు పట్టేది. సీరియల్ ప్రకారం మోటర్లు బాగు చేసేటోళ్లు ఇప్పుడు ఆ తిప్పలు తప్పాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రైతులకు కరెంట్ ఫుల్‌గా వస్తున్నది. దీని వల్ల మోటర్లు కాలిపోవడం లేదు. రైతులు సంతోషంగా పంటలకు నీరుపెడుతున్నారు. గిరాకీ పూర్తిగా తగ్గింది. అయినా పర్వాలేదు. రైతు ప్రభుత్వం వచ్చింది. సీఎం కేసీఆర్ సార్ రైతుల వెన్నంటి ఉంటున్నారు. ఇలాంటి సర్కారును కోరుకుంటున్నాం. మళ్లీ కేసీఆర్ సర్కారే రావాలి. రైతులను ఆదుకునే ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలి.

– చక్రధర్, మోటర్ మెకానిక్, దోమడుగు, గుమ్మడిదల మండలం

## వచ్చేతరం బాగుండాలంటే బీఆర్ఎస్ సర్కారే రావాలి

మూడుగంటల కరెంట్ చాలు అంటే కాంగ్రెసోళ్లకు పోయేకాలం వచ్చింది. 30 ఏండ్లుగా ఎవుసం చేస్తున్న. కరెంట్ కష్టాలంటే నాకు బాగా తెలుసు. పోయిన పదేండ్లలో కరెంట్ కోసం పొలాల కాడా చిన్న గుడిసె వేసుకొని కరెంట్ కోసం ఎదురుచూసేటోళ్లం. చుట్టుపక్కల ఉన్న రైతులందరం ఒక దగ్గర కుసొని కరెంట్ కోసం ఎదురుచూసేటోళ్లం. పాములు తిరుగుతుండే భయంతో వణికిపోయేటోళ్లం. ఇంటి కాడి నుంచి వచ్చే మాకు తిరిగి పొద్దున ఇంటికి పోతామా లేదా అని భయమేసేది. కరెంట్ వచ్చిన లోవోల్టేజ వల్ల బోరుమోటర్లు నడివేవికావు. కరెంట్ సరిపోగ లేక బోరుమోటర్లు కాలిపోయేవి. మెకానిక్‌ల చుట్ట పోయిన నాలుగైదు రోజులు గడిచిపోయేవి. అప్పటికే చేతికి వచ్చిన పంట ఎండిపోయేది. కన్నీళ్లే మిగిలుతుండే. వేసిన పంట, చేసిన కష్టం నీటిపాలు అయ్యేవి. కాంగ్రెస్, టీడీపీ పాలన చూసినం. అంతా రైతులను నిండముంచేవే వచ్చినయ్. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సార్ 24 గంటల కరెంట్ ఇస్తుండు. ఆ తిప్పలు ఇప్పుడు తప్పినయ్. పంటపొలాలకు నీరందుతుండు. కరెంట్ బిల్లులు తప్పినయ్. ప్రతిఏడు రైతుబంధు వస్తుంది.ఈ పైసలను పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేసుకుంటున్నం. ఈ ఎన్నికల్లో మళ్లీ సీఎం కేసీఆర్ సర్కారునే కోరుకుంటున్నం. కారుగుర్తుకు ఓటేసి రైతుల సత్తాచాటుతాం. కాంగ్రెస్‌ను బొందపెడుతాం.

– జోగుబీరయ్య, రైతు, అనంతారం గ్రామం, గుమ్మడిదల మండలం

## మోటర్లు ఉండవు.. ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించవు

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చెబుతున్నట్టు మూడు గంటల పాటు కరెంటు ఇస్తే రైతులందరూ ఆగమవ్వడం ఖాయం. ఎందుకంటే బోరుబావుల వద్ద ఉన్న మోటర్లను ఒకేసారి రైతులందరూ స్టార్ట్ చేస్తరు. లోడ్ ఎక్కువై మోటర్లు కాలిపోతాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పాడైపోతయ్. అప్పుడు రైతులందరికీ ఇబ్బందులు ఎదురవుతాయి. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులు సంతోషంగా ఉన్నరు. రైతులు బాగుపడటం కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం ఇష్టం ఉండదు. రైతుందరికీ నిరంతర కరెంట్, రైతుబంధు కావాలంటే కాంగ్రెస్ పార్టీ రావొద్దు. రైతాంగం మొత్తం ఆలోచించి బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేసి కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేయాలి.

– యాదవులు, రైతు కోహీర్ (సంగారెడ్డి జిల్లా)

## 10హెచ్‌పీ మోటర్లను పాత సామన్ల కింద అమ్ముకున్నం

వానకాలంలో వానలు పడకపోయినా 24 గంటల కరెంటు ఉండడంతో పొలం ఎండిపోలేదు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నట్లు 3 గంటల కరెంటు ఉంటే నాలుగున్నర ఎకరాలు ఎండిపోయేది. తీవ్రనష్టం జరుగుతుండే. కాంగ్రెస్ పాలనలో 10 హెచ్‌పీ మోటర్లు వాగుల్లో వేసి నడిపించాం. లో ఓల్టేజీతో తరచూ కాలిపోయేవి. కాలిపోయిన మోటర్లను చేయించేందుకు ఖర్చు ఎక్కువయ్యేది. కరెంట్ ఎక్కువగా, తక్కువగా రావడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే నారాయణఖేడ్‌కు ట్రాక్టర్లలో తీసుకెళ్లి నాలుగురోజులు లైన్‌లో నిలబడి మంచిగా చేయిస్తుంటిమి. అటు మోటర్లకు, ఇటు ట్రాన్స్‌ఫార్మర్లకు ఖర్చు అధికంగా అయ్యేది. దీంతో పంట పండించినా అప్పులు మిగిలేవి. బోరు బావుల్లో 10 హెచ్‌పీ మోటర్లు దించితే ఉన్నది ఊడిపోతుంది. ఒక వేళ దించితే బోరుబావులు ఎండిపోతయి. రైతులు సుఖంగా బతకడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. మూడు గంటల కరెంటుతో పాలిన గుంటనే పారుతుంది. 3గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే పాతతోజులు దాపురిస్తాయి. దిక్కుమాలిన ఆలోచనతో రైతులను సర్వనాశనం చేసే కుట్ర ఉన్నది. మేమిప్పుడు 5 హెచ్‌పీ మోటర్లు వినియోగిస్తున్నం. మోటర్లు కాలిపోవడం చాలా మట్టుకు తగ్గిపోయింది. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న 24 గంటలు నాణ్యమైన కరెంటు, రైతుబంధు, రైతు బీమాలతో రైతులు సంతోషంగా ఉన్నరు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదిక్కునివ్వద్దు. రైతులందరూ సంతోషంగా ఉండాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వానికి మళ్లీ పట్టంకట్టాలి.

– విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు కల్హేర్ (సంగారెడ్డి జిల్లా)

## కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ కరెంట్ కష్టాలే..

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఎన్నికల్లో ఓటు వేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు. సీఎం కేసీఆర్ రైతుల కష్టాలు గర్తెరిగి ఇబ్బందులు లేకుండా చేసిండు. 24 గంటలు కరెంట్‌తోపాటు రైతుబంధు, రుణమాఫీ చేసిండు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు కేవలం 3 గంటల కరెంట్ సరిపోతుందని అనడం సిగ్గుచేటు. పంట పొలానికి సాగునీరు పెట్టుకునేందుకు 10 హెచ్‌పీ పెట్టుకోవాలంటే రూ. లక్ష వరకు ఖర్చు అవుతుంది. గతంలో పంటలకు తడులు అందించేందుకు రాత్రుళ్లు సైతం మోటర్ వద్దన్న నిద్రపోవాల్సి వచ్చేది. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక నానా ఇబ్బందులు పడ్డాం. పక్కనే ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 10 గంటల కరెంట్ సరఫరా చేస్తామని చెప్పి 3 గంటలు కూడా ఇవ్వడం లేదు. వారి మాయమాటలు నమ్మితే అక్కడి రైతుల ఇబ్బందులు మనకు కూడా తప్పవు. కాంగ్రెస్కోళ్లను అస్సలు నమ్మొద్దు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలి. సీఎం కేసీఆర్ సారే మళ్లీ సీఎం కావాలి.

–నుధాకర్‌రెడ్డి, రైతు, ఖలీల్‌పూర్, న్యాల్‌కల్ మండలం

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# మూడు గంటల కరెంటుతో... ఆగమైతం

### ఎద్దు, ఎవుసం తెల్వని రేవంత్ పిచ్చికూతలు

- 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటే వేల ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం
- పీసీసీ చీఫ్ వ్యాఖ్యలపై మండిపడుతున్న రైతులు
- ధరణితో దళారులకు చెక్‌పడింది
- సాఫీగా భూముల రిజిస్ట్రేషన్లు
- నాటి విద్యుత్ కోతలు, భూ సమస్యలను గుర్తు చేసుకుంటున్న అన్నదాతలు
- కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్
- సంగారెడ్డి జిల్లాలో 1.01 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు




సంగారెడ్డి నవంబర్ 20(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంటు కష్టాలు తప్పవని సంగారెడ్డి జిల్లా రైతాంగం చెబుతున్నది. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని, రైతులు క్షేమంగా ఉండాలని కోరుకునే కేసీఆర్ పాలన కొనసాగాలని సంగారెడ్డి జిల్లా రైతులు గట్టిగా కోరుకుంటున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా వ్యవసాయానికి మూడుగంటల విద్యుత్ సరఫరా చేస్తే రైతులకు కష్టాలు తప్పవని, మూడుగంటల విద్యుత్ సరఫరా చేస్తే మూడు గంటల భూమి కూడా తడవదని చెబుతున్నారు. రేవంత్‌రెడ్డి చెబుతున్నట్లుగా 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే రూ.1.50లక్షలకుపైగా ఖర్చు అవుతుందని, అంతడబ్బులు పెట్టుకునే ఆర్థికస్థోమత రైతుల వద్ద లేదంటున్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంటు కష్టాలు కొనితెచ్చుకున్నట్టేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తొమ్మిదన్నరేండ్లుగా కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండగా, రైతులు వరి, చెరుకు ఇతర ఉద్యానవన పంటలు సాగు చేసుకుంటూ చేతిలో డబ్బులు చూస్తున్నారు. దీంతో రైతులు సంతోషంగా ఉన్నారు.

#### జిల్లాలో ఉచిత విద్యుత్‌తో 1.01 లక్షల మంది రైతులకు లబ్ధి

సంగారెడ్డి జిల్లాలో 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరాతో 1.01 లక్షలకు పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. జిల్లాలో 1,01,707 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అవుతుంటే పొరుగునే ఉన్న కర్ణాటకలో మాత్రం అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం మూడు గంటల విద్యుత్ సరఫరా చేస్తుంది. దీంతో అక్కడి రైతులు కరెంటు కష్టాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 7,45,710 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతిరోజూ 12 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతున్నది. ఇందులో గృహ అవసరాలకు ప్రతిరోజూ 2.5 మిలియన్ యూనిట్లు, వ్యవసాయానికి 5 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన విద్యుత్ రంగాన్ని సీఎం కేసీఆర్ పెద్ద పీట వేశారు. సంగారెడ్డి జిల్లాలో రూ.1065.77 కోట్లు విద్యుత్ సరఫరా వ్యవస్థన అభివృద్ధి చేశారు. రూ.73.38 కోట్లతో జిల్లాలో 220 కేవీ సబ్‌స్టేషన్లు 15,132 కేవీ సబ్‌స్టేషన్లు మూడు నిర్మించారు. రూ.992.39 కోట్ల వ్యయంతో 33 కేవీ, 11 కేవీ సబ్‌స్టేషన్లు, ఎల్‌టీలైన్లు, పవర్ (ట్రాన్స్‌ఫార్మర్లు, డ్రిస్టిబ్యూషన్ (ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో సంగారెడ్డి జిల్లాలో విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగై వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అవుతున్నది.

## వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్

సంగారెడ్డి జిల్లా పారుగునే ఉన్న బీదర్ ప్రాంతంలో వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరఫరా అవుతుండగా సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నది. నిరంతర విద్యుత్ సరఫరాతో రైతులు సంతోషంగా ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో 1,01,707 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లుకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నది. వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఖర్చు చేసింది. మరీ ముఖ్యంగా లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు జిల్లాలో ప్రభుత్వం కొత్త సబ్‌స్టేషన్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేసింది. ఉచిత విద్యుత్ సరఫరాతో జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో వరి, చెరుకు, ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జహీరాబాద్ ప్రాంతంలోని రైతులు చెరుకు, వరి, కూరగాయల పంటలను సాగు చేస్తుండగా సంగారెడ్డి, అందోలు నియోజవర్గంలోని రైతులు బోరుబావుల కింద వరి, చెరుకు పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాలో 5 లక్షల ఎకరాలకు పంటలు సాగు కాగా ప్రస్తుతం జిల్లాలో 7.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయి. వ్యవసాయానికి ప్రతిరోజూ 5 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేస్తుంది ప్రభుత్వం. ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం ఏటా రూ.1438 కోట్లు ఖర్చు చేస్తుంది.

## మూడు గంటలు కరెంటుతో తిప్పలే..

సిర్గాపూర్, నవంబర్ 20: గిప్పుడు సీఎం కేసీఆర్ సర్కారు ఇస్తున్న 24 గంటల కరెంటుతో రైతులు రెండు పంటలు పండిస్తూ సంతోషంగా ఉన్నారు. నిరంతర కరెంట్‌తో పంటలు మంచిగా పండుతున్నాయి. అయితే కాంగ్రెసోళ్లు అధికారంలోకి రాగానే మూడు గంటల కరెంటు సరఫరా చేస్తా మనడం సర్రెంది కాదు. అదిగాక 10 హెచ్‌పీ మోటరు పెడితే మూడు గంటలు సరి పోతుందని చెప్పడం విడ్డూరంగా ఉంది. అసలు వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటరు అవసరమే లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మాత్రం రైతులంతా గతంలో పడిన పాట్లు మళ్లీ చూడాల్సి వస్తది. అందుకే కాంగ్రెస్‌ను నమ్మవద్దు. రైతుందరూ 24 గంటలపాటు కరెంటు ఇస్తున్న కేసీఆర్ సర్కారుకే మద్దతివ్వాలి. మళ్లీ సీఎంగా కేసీఆర్ సారే కావాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటేనే రైతులందరూ సంతోషంగా ఉంటారు.

– జ్ఞానోభరావు పాటిల్, రైతు బొక్స్‌గాం (సిర్గాపూర్ మండలం), సంగారెడ్డి జిల్లా

## కరెంట్ కోసం జాగారం ఉండేటోళ్లం

సంగారెడ్డి అర్బన్, నవంబర్ 20: గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. కరెంట్ కోసం రాత్రి సమయాల్లో పొలాల దగ్గర జాగారం చేసేటోళ్లం. ఊర్లోకి రాకుండా పొలాల మధ్యనే గడిపేటోళ్లం. వచ్చిన కరెంట్ కూడా హైఓల్టేజీతో వచ్చి మోటర్లు కాలిపోతుండే. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ రైతులకు కరెంట్ కష్టాలు ఎదురవుతాయి. 3 ఇంచుల బోరుబావిలో 10 హెచ్‌పీ మోటర్లు బిగిస్తే ఐదు నిమిషాల్లో నీళ్లు అయిపోతయ్. దీంతో మోటర్లు కాలిపోవడమే కాకుండా పంట నష్టం జరిగి మళ్లీ రైతులు నష్టపోతరు. అందుకే రైతులందరూ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయవద్దు. సీఎం కేసీఆర్ రైతు బాంధవుడు, రైతుకు నష్టం జరిగితే సహించడు. ఆయన రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా 24 గంటలు నాణ్యమైన కరెంట్ ఇస్తూ రైతులను ఆదుకుంటుండు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు కరెంట్ కష్టాలు పోయి, పగటి పుటనే వ్యవసాయం చేసుకుంటూ అధిక దిగుబడులు సాధిస్తున్నాం. అందుకే రైతులందరూ ఏకతాటిపైకొచ్చి సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలి.

– గంగారాం, కులబ్‌గుర్, (సంగారెడ్డి జిల్లా)

## జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు : 1,01,707

| కేటగిరి | సంఖ్య | ఖర్చుచేసిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 440, 220 కేవీ సబ్‌స్టేషన్లు | 2 | రూ.73.38 |
| 33/11 కేవీ సబ్‌స్టేషన్లు | 149 | రూ.62.33 |
| 33కేవీ లైన్లు | 1020.17 | రూ.24.57 |
| 11కేవీ లైన్లు | 8904.66 | రూ.146.39 |
| ఎల్‌టీ లైను | 18465.37 | రూ.121.58 |
| పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు | 284 | రూ.75.79 |
| డ్రిస్టిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు | 35658 | రూ.280.07 |

## నిరంతర విద్యుత్‌లో మేలు

కాంగ్రెస్ అంటేనే కరెంటు కష్టాలకు నెలవు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలు అని మాట్లాడడం రైతుంధులపై ఉన్న కపటప్రేమకు నిదర్శనం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ వస్తే రైతులందరూ సాగునుపదిలి కూలి పనులు చేసుకునే సమయం వస్తుంది. తెలంగాణ సర్కార్ వచ్చాకే రైతులందరూ సంతోషంగా ఉండేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నడు. సేద్యానికి పూర్తిస్థాయిలో తొమ్మిది గంటల నిరంతర కరెంటు ఇచ్చినా భూమిని సాగు చేసుకోవచ్చు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు తమకు ఇష్టం వచ్చిన విధంగా అమలుకు చేతగాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీలను పట్టించుకోరు. మన రాష్ట్ర సరిహద్దులో ఉన్న కర్ణాటకలో ఇటీవలే ఎన్నికలు జరిగాయి. అక్కడ ప్రజలకు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీల్లో ఒకేఒక్కటి మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కొనుమెరుపు లాగా అమలు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం అనగానే కుటుంబంలోని మహిళలందరూ బస్సు ఎక్కగానే సీట్ల కోసం జుట్టు పట్టుకుని తన్నుకున్నారు. అలాంటి పరిస్థితి తెలంగాణలో రాకుండా రైతుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయి.

– రామకృష్ణారెడ్డి, రైతు కోత్లాపూర్, (సంగారెడ్డి జిల్లా)

## కర్ణాటకలో బోర్లు బంద్.. తెలంగాణలో బోర్లు ఫుల్..

ఇటీవల నారాయణఖేడ్‌లోని మారుమూల గ్రామానికి చుట్టుపు చూపుగా వెళ్లాను. కరెంటు పోగానే కర్ణాటక రైతుల బోర్లు బంద్ అయినవి. సరిహద్దులో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో బోర్లు ఫుల్‌గా పోస్తున్నవి. పక్కనే తెలంగాణ సరిహద్దులో ఉన్న గ్రామాల్లో బోర్లు నడుస్తుండడంతో కర్ణాటక రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. వారి బాధను చూసి తట్టుకోలేకపోయాను. వారిని కలిసి వివరాలు అడిగితే తెలంగాణ బిడ్డలు జాగ్రత్త కాంగ్రెసోళ్ల మాయమాటలు విని ఓట్లు వేయకండి. వారి ఇచ్చే హామీలన్నీ ఉత్తవే ..హామీలు ఇస్తారు కానీ అమలు చేయరు బిడ్డా. అని తనతో కాంగ్రెస్ మాయమాటల గురించి వివరించారు. 10హెచ్‌పీ మోటర్లతో బోరుబావుల నుంచి తోడేస్తే భూగర్భ జలాలు మిగలవు. రేవంత్‌రెడ్డి మాటలు ఒట్టి మాటలే అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేస్తారు. సేద్యం, తాగడానికి నిరంతరం 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్న రాష్ట్రం ఒక తెలంగాణ రాష్ట్రమే. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలుచేసేందుకే కృషి చేసే నాయకులు సీఎం కేసీఆర్. దేశంలో 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మత్రమే. తెలంగాణ ప్రజలు గర్వంగా చెపుకునే అవకాశం కల్పించిన గొప్ప నాయకుడు కేసీఆరే.

– వెంకటేశం, రైతు కోత్లాపూర్ (సంగారెడ్డి జిల్లా)

## ధరణితోనే ప్రజలకు మేలు

రాయికోడ్, నవంబర్ 20: గతంలో రైతులు ధరణి లేకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడేటోళ్లు. తల్లిదండ్రుల నుంచి వచ్చే భూమిని సైతం వాళ్ల పేరుకు మార్చడానికి ఎన్నో పైరవీలు చేసేటోళ్లు. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణితో సులువుగా పట్టా చేసుకుంటున్నం. ఎవరికి కూడా పైసా ఇవ్వకుండానే నేరుగా భూమి హక్కులు పొందుతున్నాం. ధరణితో మనభూమిపై హక్కులు మనకే ఉండడం అనేది కేసీఆర్ ఆలోచన. దీంతో ప్రతి రైతూ సంతోషంగా పంటలు పండించుకుంటున్నాడు. కానీ కాంగ్రెస్ ధరణిని తొలగిస్తామని చెప్పడం సిగ్గుచేటు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే కదా. రైతులందరూ మాట్లాడుకొని సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించుకోవాలి.

– వగ్గు రమేశ్‌కురుమ, గ్రామం జంబ్గి(కె) మండలం రాయికోడ్, సంగారెడ్డి జిల్లా

## ధరణిని తొలిగిస్తే మళ్లీ రైతులకు గోస తప్పదు

కాంగ్రెస్ పార్టీ ధరణిని రద్దు చేసి పాత రెవెన్యూ వ్యవస్థను తీసుకొస్తామని భట్టి విక్రమార్క చెప్పడం చూస్తుంటే పటేల్, పట్వారీలు వస్తే మళ్లీ రైతులకు గోస మొదలైనట్టే. రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన ధరణితో భూసమస్యలు తొలిగిపోయాయి. నేరుగా రైతులకు రైతుబంధు పెట్టుబడి సాయం అందిస్తుండే కాంగ్రెస్ వారికి మింగుడుపడడం లేదు. వారి హయాంలో భూములు సమస్యలు పరిష్కరించుకునేందుకు చెప్పులు అరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుకున్నారు. కాంగ్రెస్కోళ్లను నమ్మితే రైతులు ఇబ్బందులు పడాల్సిందే. ధరణి పోర్టల్‌ను తీసేస్తమని అంటున్న కాంగ్రెస్‌ను రైతులంతా ఏకమై బంగాళాఖాతంతో కలపాలి. గట్లయితేనే రైతుల బతుకులు బాగుపడుతాయి.

– భూమరెడ్డి, రైతు, చీకూర్తి, న్యాల్‌కల్ మండలం